క్లుప్తంగా

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని డౌనల్ ప్రాంతంలో గల హజరత్ సయ్యద్ తాలిబ్ అలీషా బాబా దర్గా ప్రాంగణంలో ఈనెల 30 నుంచి ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు ఆశీహుస్సేన్, ఇషాక్‌హుస్సేన్‌లు తెలిపారు. ఉర్సు ఉత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా జరుగుతాయని, ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల పాటు రాత్రి ప్రత్యేక ఖవ్వాలీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉర్సు ఉత్సవాల్లో కొనసాగించే వ్యాపార సముదాయాల కోసం ఈనెల 16న వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులకు సన్మానం



మనీషాను సన్మానిస్తున్న జెడ్పీటీసీ రామారావు

దహెగాం: ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థినులను శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. ప్రైవేట్ కళాశాలలో చదువుకున్న మండల కేంద్రానికి చెందిన చప్పిడి మనీషా 988 మార్కులు సాధించగా, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని సామెర శిరీష 974 మార్కులతో సత్తా చాటింది. వీరిని జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు ఘనంగా సన్మానించారు. మరో కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు శిరీషను శాలువాతో సన్మానించారు. మండల రైతు బంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, కోనేరు ఫణి, బీజేపీ నాయకులు పడాల సురేశ్, చప్పిడి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ శనివారం తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పనులు పరిశీలిస్తున్న ఏపీవో మల్లయ్య

కెరమెరి: వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు తలకు రుమాలు చుట్టి ఉపాధిహామీ పనులు చేయాలన్నారు. ఉదయం 6 నుంచి 11 వరకు మాత్రమే పనులు చేయాలని, పనులు చేశాక కొలతలు తీసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇంద్రవెల్లి: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత కోరారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయాన్ని సందర్శించిన వీవోఏల సమ్మెకు మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26 వేల వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దిలీప్‌సింగ్ ఠాకూర్, ఆత్రెల్లి రాజలింగు, మదన రాజు, షేక్ ఫెరోజ్, కోట్నాక్ భారత్‌రావ్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం మండలంలోని గిన్నెర గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏ ర్పాటు చేసిన సన్మానసభలో మాజీ ఎంపీ గోడం న గేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రం నుంచి గిన్నెర వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ప్రతీ గ్రామంలో రోడ్లు వేయడం జరిగిందన్నారు. ప్రతిపక్షాల నాయకులను నమ్మవద్దన్నారు. శేఖర్, జునైద్, బీరాజ్, ఇస్తారి పటేల్, దుర్గు, మాన్కు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగించిన ఎస్సై

నెరడిగొండ: మండలంలోని నాగమల్యాల్ గ్రామానికి చెందిన సెడ్మకి లోకేశ్ ఇటీవల తన ఫోన్ పోగొట్టుకున్నాడు. అదేరోజు నెరడిగొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా రికవరీ చేశారు. శనివారం ఎస్సై సాయన్న బాధితుడికి ఫోన్ అందజేశారు.



ఈసగాంలో ప్రకాశ్ రాణా ఇంటిలో నిర్మించిన ఆలయం

సండే స్పెషల్

ఇళ్లలోనే ఆలయాలు..!

- ఏటా వివిధ పూజా కార్యక్రమాలు
- సంప్రదాయబద్ధంగా ఆరాధ్య దైవాలకు పూజలు
- ఆకట్టుకుంటున్న బెంగాలీల ఆధ్యాత్మిక మార్గం

సిర్పూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో నివాసం ఉండే బెంగాలీలు తమ ఆచార, సంప్రదాయాలను కొనసాగిస్తూ భక్తిమార్గంలో ప్రయాణిస్తున్నారు. తమ ఆరాధ్య దైవాలకు పూజలు చేసేందుకు ఇండ్లలోనే ఆలయాలు నిర్మించుకోవడం విశేషం. కాళీకామాత, శివుడు, శ్రీకృష్ణుడుల ఆలయాలు నిర్మించుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిలోనే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దైవత్వంలోనే మానవత్వం ఉందని, సద్బుద్ధితో దేవుడిని పూజించే వారు సమాజ శ్రేయస్సుకు పాటుపడతారని బెంగాలీలు అంటున్నారు. భక్తి మార్గం అనే సిద్ధాంతాన్ని విశ్వసిస్తూ తాము లోక కల్యాణాన్ని కోరుకుంటామని చెబుతున్నారు. – చింతలమానెపల్లి

1964 నుంచి..

సిర్పూర్ నియోజకవర్గం కాగజ్‌నగర్ మండలంలోని ఈసగాం, సిర్పూర్(టి) మండలంలోని లక్ష్మీపూర్, కౌటాల మండలంలోని రవీంద్రనగర్ గ్రామాల పరిధిలో బెంగాలీలు నివసిస్తున్నారు. భారతదేశం పాకిస్తాన్ విభజన సమయంలో వీరికి అప్పటి ప్రభుత్వం నియోజకవర్గంలో ఆశ్రయం కల్పించింది. 1964లో వచ్చిన వీరికి ఆయా ప్రాంతాలలో స్థలాలు కేటాయించారు. దశాబ్దాలుగా స్థానికులతో కలిసిపోయిన వీరు తమ ఆచార వ్యవహారాలను పాటిస్తూ తమ సంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకుంటున్నారు. ప్రకృతిపై ప్రేమను కలిగి ఉండే వీరు తమ



రవీంద్రనగర్‌లోని సంతోష్ మండల్ ఇంటి ఆవరణలో నిర్మించిన శివాలయం

ప్రత్యేక జీవనశైలితో ఆకట్టుకుంటున్నారు.

భక్తి మార్గం.. ఆధ్యాత్మిక చింతన..

కాళీకామాతను ఆరాధ్యదైవంగా కొలిచే బెంగాలీలకు ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. లోక కల్యాణం ఆకాంక్షిస్తూ బెంగాలీలు నిర్వహించే అఖండ హరినామ సంకీర్తన, దసరా సందర్భంగా 5రోజుల పాటు నిర్వహించే దుర్గా ఉత్సవాలు, పూరీలో నిర్వహించే రథయాత్ర సందర్భంగా ఈసగాంలో నిర్వహించే పూరీ జగన్నాథ రథయాత్ర స్థానికంగా ఎంతో ప్రాచుర్యం పొందాయి. కృష్ణుడు, రాముడు, శివుడిని పూజించే వీరు స్థానికంగా నిర్వహించే అయ్యప్ప, హనుమాన్ ఉత్సవాలలోనూ చురుగ్గా పాల్గొంటారు. భక్తి కార్యక్రమమైనా, ఉత్సవమైనా నిర్వహించేది లోక కల్యాణార్థమని బెంగాలీలు చెబుతుంటారు. ఆరాధ్య దైవాలకు చేసే పూజలు, ఆకట్టుకునే అలంకరణలు, బెంగాలీల ఆతిథ్యం వారిని స్థానికులకు దగ్గర చేశాయి. దైవ చింతన కలిగిన బెంగాలీలు ప్రత్యేక విధానంలో పూజలు నిర్వహిస్తారు. క్రమం తప్పకుండా పూజలు నిర్వహించడం వీరి దైనిక జీవన విధానంలో భాగం. తమ ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతిరోజూ తమ ఆరాధ్య దైవాలకు పూజలు నిర్వహిస్తారు. కాళీకామాత, శివుడు, శ్రీకృష్ణుడులను కొలిచేందుకు తమ ఇళ్లల్లోనే ఆలయాలు నిర్మించుకున్నారు. నిత్యం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిలోనే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొంటున్నారు.

లోక కల్యాణం కోసం..



మా గ్రామంలో ప్రతి ఏటా అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తాం. మూడు రోజులపాటు నిరంతరాయంగా భక్తిశ్రద్ధలతో జరుపుతాం. లోక కల్యాణం కోరుకుంటూ భగవంతుడిని ప్రార్థిస్తాం. – సుశీల్ మండల్, సర్పంచ్, రవీంద్రనగర్

సంప్రదాయాలు కొనసాగిస్తున్నాం



భక్తి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సంప్రదాయాలు కొనసాగిస్తున్నాం. ఉన్నతమైన మన సంస్కృతి, పద్ధతులు ముందు తరాలకు అందించేందుకు భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మంచి మార్గంలో ప్రయాణించడానికి సైతం ఇవి ఉపయోగపడుతాయి. – సమీర్ మండల్, ఈసగాం

ప్రశాంతత లభిస్తుంది



భగవంతుడిని నిత్యం ప్రార్థించడం ద్వారా ప్రశాంతత లభిస్తుంది. జీవితంలో కష్టాలు, ఆపదలు, ఇబ్బందులను ఎదుర్కొనేందుకు తగిన ఓర్పును పొందడానికి భక్తి ఒక మార్గం. ఉన్నతమైన భక్తిమార్గంలో లోక శ్రేయస్సును కోరుకుంటాం. – సంతోష్, రవీంద్రనగర్

రోడ్ల నిర్మాణంలో జాప్యం

- నూతనంగా 15 అనుబంధ రహదారులు మంజూరు
- రెండు నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- వానాకాలంలోపు పనులు చేపట్టాలని డిమాండ్



ఇటీవల కురిసిన వర్షానికి అధ్వానంగా మారిన ఖమాన రహదారి

వాంకిడి: దశాబ్దాల కాలం నుంచి రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మండల వాసులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. మండలంలోని ఆయా గ్రామాలకు 15 నూతన బీటీ రోడ్లు మంజూరు చేసింది. రెండు నెలల క్రితమే రోడ్లు మంజూరు కాగా రెండు రహదారులు మినహా మిగతా అన్ని రోడ్లకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. కానీ ఇప్పటికీ ఏ ఒక్క చోట కూడా పనులు ప్రారంభం కాలేదు. మరో నెల రోజుల్లో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నందున ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వేసవిలోనే పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త రోడ్లు మంజూరు..

ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుంచి మండలంలోని వివిధ ఆదివాసీ గ్రామాలకు వెళ్లే అనుబంధ రహదారుల్లో బీటీ నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు. మండలంలోని సామేల, పెద్దపుల్లార, చిన్నపుల్లార వయా చిచుపల్లి, లీటాగూడ, గుంజాడ, మహాగాం, డొంగర్‌గాం వయా దొడ్డిగూడ, పిప్పర్‌గొంది, ఖిరిడి, బంబారా నుంచి రాజేష్‌నగర్, సవాతి నుంచి అనంతపూర్, గొండు కొసార, వెల్గి నుంచి రొాంపల్లిగూడ వయా భెడగాం, ఎనోలి, ఖమాన, చౌపన్‌గూడ గ్రామాలకు అనుబంధ బీటీ రహదారులు మంజూరయ్యాయి. కాగా ఇప్పటివరకు ఖిరిడి, చిన్నపుల్లార రోడ్లు మినహా అన్నింటికి టెండర్ కూడా పూర్తయింది. కానీ మండలంలో ఇప్పటివరకు ఏ ఒక్క చోట రహదారి పనులు ప్రారంభం కాలేదు.

అధ్వాన పరిస్థితులు

ఆదివాసీ గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ మట్టి రోడ్లే కావడంతో చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. ఒర్రెలు ఉప్పొంగి పారుతుంటాయి. వంతెనలు లేని కారణంగా పల్లె ప్రజలు బయటి ప్రపంచానికి సంబంధం లేకుండా జీవిస్తున్నారు. అత్యవసర సమయాల్లో కనీసం వైద్యం సహాయం కూడా పొందలేని పరిస్థితి వారిది. రహదారులు లేక ఆదివాసీ బిడ్డలు విద్యకు దూరమవుతున్నారు. త్వరగా రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు.

గుంతలతో ఇబ్బందులు



మండల కేంద్రం నుంచి చౌపన్‌గూడ గ్రామం వరకు దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. వాన పడితే చాలా ఇబ్బంది పడుతున్నాం. మంజూరైన రహదారుల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి. – సీడం కట్టి, చౌపన్‌గూడ

త్వరగా ప్రారంభించాలి



మంజూరైన రహదారుల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి. చినుకుపడితే చిత్తడిగా మారే రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలోనే రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తే వచ్చే వానాకాలంలో అవస్థలు తప్పుతాయి. – లోబడె లహుకుమార్, జీసీ విద్యార్థి సంఘం నాయకుడు

జేపీఎస్‌లను వెంటనే క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న అర్షద్‌హుస్సేన్

బెజ్జూర్: రాష్ట్రంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న కార్యదర్శుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శుల సమ్మెకు బీఎస్పీ పూర్తి మద్దతు ఉన్నందన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా రాంప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం సాయి, నాయకులు రమేశ్, పోశం, దుర్గం ప్రశాంత్, బిక్షపతి, అరుణ్, సల్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



చెక్కు అందిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. శనివారం కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ప్రభుత్వం వైద్య ఖర్చులు అందిస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్‌గౌడ్, నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలి



దరఖాస్తులు చూపుతున్న దివ్యాంగులు

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని వి వ్యాంగుల హక్కుల జాతీయవేదిక నాయకులు డిమాండ్ చేశా రు. సంఘం ఆధ్వర్యంలో మా డు పట్టణంలోని గాంధీపార్కులో కాలనీ ఏర్పా టు చేయాలని దివ్యాంగులను నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఇమ్రాన్, ఫైసల్ అహ్మద్, సయ్యద్ సాజిద్, మోసీన్, ఆరీఫా, ముస్తాఫా, శాకీర్, అంజద్ పాల్గొన్నారు.

పోటీకి అనుగుణంగా సన్నద్ధం కావాలి

ఎదులాపురం: ప్రస్తుతం అన్ని రంగాల్లో పోటీ పెరిగిందని పోటీకి అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ కొత్తవార్ అన్నారు. ఆర్యవైశ్యవికాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయక్ చౌక్‌లోని సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణను సందర్శించారు.

డాక్టరేట్ పొందడంపై హర్షం

ఆదిలాబాద్‌రూరల్: తలమడుగు మండలం రుయ్యడి గ్రామానికి చెందిన అరుగుల శ్రీనివాస్ డాక్టరేట్ పొందడం పట్ల ఆదిలాబాద్ పట్టణ వాకింగ్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆదిలాబాద్‌లో శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. వండేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో గణిత శాస్త్రంలో డాక్టరేట్ పొందడం హర్షనీయమన్నారు. జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, మేకల మల్లన్న, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

బోథ్: బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే రా థోడ్ బాపురావు ఆదిలాబాద్‌లోని తన నివా సంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు శనివారం పంపిణీ చేశారు. మొత్తం 67 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల 10 వేల 500ల విలువైన చె క్కులు అందించారు. పేద వారికి సీఎం రిలీఫ్ ఫండ్‌తో కొంత ఆసరా ఉంటుందన్నారు. కా ర్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతీగింజ కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: కొన్న పంటను పండించిన రైతుల వద్ద నుంచి ప్రభుత్వం ప్రతీగింజ కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో శనివారం మాట్లాడారు. ఎకరానికి కేవలం ఐదు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పరిమితి విధించడం సరికాదన్నారు. ప్రైవేట్ దళారుల వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని బీఆర్ఎస్ నాయకులు ప్రగల్భాలు పలికారని, అయితే ప్రస్తుతం నిబంధనలు విధించడం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు అశోక్ రెడ్డి, క్రాంతికుమార్, సతీశ్‌రెడ్డి, తోకల నరేశ్, ముఖీమ్, నవీన్ వర్మ, అశ్విన్, ఆశాంత్, బుటేక్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నెరడిగొండ: మండలంలోని సావర్గాం గ్రామానికి చెందిన మద్దెల రాజన్న ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లిక్కర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బల రాం జాదవ్ శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

భానుడి భగ భగలు..!

- పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనం
- కౌటాలలో 42.3 డిగ్రీలు నమోదు



జనం లేక నిర్మానుష్యంగా కౌటాలలోని కుమురంభీం చౌరస్తా

జిల్లాలో శనివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	ఉష్ణోగ్రత (సెంటీగ్రేడ్‌లో)
కౌటాల	42.3
వంకులం	42.1
తిర్యాణి	42.1
రెబ్బెన	41.9
వాంకిడి	41.8
కాగజ్‌నగర్	41.7
బెజ్జూర్	41.2
ఆసిఫాబాద్	41.1

కౌటాల: భానుడు వారం రోజుల నుంచి భగభగ మండుతుండడంతో జిల్లా నిప్పుల గుండంగా మారింది. మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 42డిగ్రీ సెల్సియస్‌లు మించి నమోదవుతున్నాయి. గాలిలో తేమ తగ్గిపోవడంతో ఉదయం 8 గంటల నుంచే జనం ఎండవేడిమి తాళలేకపోతున్నారు. అధిక వేడితో వడగాల్పులు వీస్తున్నందున జనం ఇళ్ల లోనే ఉడికిపోతున్నారు. పెరిగిన ఉష్ణోగ్రతలతో పిల్లలు, పెద్దలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కౌటాలలో 42.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పెరిగిన ఉష్ణోగ్రతలు

వారం రోజులుగా భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇటీవల జిల్లాలో అకాల వర్షాలు కురిసి కొన్ని రోజుల పాటు వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. కానీ గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరిగాయి. భానుడి ప్రతాపంతో ఉద్యోగులు, పనులకు వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం వేళ అందరూ కార్యాలయాలు, ఇళ్లకే పరిమితం అవుతుండడంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న క్రమంలో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండదెబ్బ ప్రభావం అన్ని కీలక అవయవాలపై పడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. గుండె, మూత్రపిండాలు, కండరాలు, మెదడు, కాలేయంపై తీవ్ర ప్రభావం ఉంటుందంటున్నారు. వివిధ అవసరాల నిమిత్తం బయటకు వెళ్లేవారు సాధ్యమైనంత వరకు ఉదయం 10 గంటలకు ముందు, సాయంత్రం చల్లబడిన తర్వాత మాత్రమే వెళ్లాలని నిపుణులు సూచిస్తున్నారు. శీతల పానీయాలకు బదులు కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఈసారి ఎండలు విపరీతంగా మండుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.